రిక్షాలో సినిమానుంచి వెళ్తున్న మొగుడూ పెళ్లాల్ని పోలీసులు భయపెట్టినట్లు హాలు వాళ్ళని పోలీసులు భయపెట్టగల్రా? లేరు. సినిమా హాలు మేనేజర్లకి పోలీసువాళ్ళకి లావాదేవీలు, యిచ్చి పుచ్చుకోడాలు, అనేక మర్యాదలుంటాయ్.

మామూలు తెలివితక్కువ ప్రేక్షకులు ఎ.సి. వెయ్యటం లేదేమని అడిగితే హాలువాళ్ళు పళ్ళూడగొట్టి చేతులలో పెడ్తారు. పెట్టరూ?

అందుకే మా చచ్చిపోయిన మేనత్త ఒకావిడ సినిమా అందం రాక, నోరు తిరక్క 'శనీమా' అనేది. ఇవి నిజంగా సినిమాలు కావు - 'శనిమా హాళ్ళే' సుమా! సినిమా దుఃఖం జన్మ దుఃఖం జరా దుఃఖంలా పునః పునః కలుగుతూ వుంటుంది. తస్మై శ్రీ గురవేనమః

# మావూరు బెజవాడ

మా చిన్నపుడు 'బెజవాడ' వెళ్ళడమంటే మా కెంతో గొప్పగా, దర్జాగా అంతకంటె మరీ మరీ సరదాగా వుండేది. రైలు కృష్ణా బ్రిడ్జి మీంచి వెళ్తుంటే 'ధన్ - ధన్ - ధన్ - ధన్ - ధన' మని చప్పళ్ళు చేస్తుంటే, బిర బిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే - మా కెంతో గర్వంగానూ, గొప్పగానూ వుండేది. ఏలూరు వైపు నుంచి కాని నైజాం వైపు నుంచి కాని రైలు మీద వస్తుంటే అంత యిదిగా వుండేది కాదు మాకు. ఎందుకంటే వానా కాలంలో తిక్క వచ్చినట్లు పరవళ్ళు తొక్కే బుడమేరు తప్ప ఆ వైపు కృష్ణమ్మా లేదు, ధనాధన్ మనిపించే పెద్ద బ్రిడ్జీ లేదు. కృష్ణానది యిటు వైపున కూడా ప్రవహిస్తే ఎంత బావుణ్నో అని ఫీలయేవాళ్ళం. బెజవాడంటే మాకు మా విశ్వనాథం మామయ్యగారే. మా వారేమో అప్పటికింకా చిన్న బచ్చాయేట. మా వారి చిన్నపుడు వాళ్ళ బెజవాడ పెదనాన్నగారన్నా బెజవాడ అమ్మఅన్నా ఎంతో ప్రాణం. ఆయనెప్పుడూ మిఠాయిలు, పళ్ళు, పూలూ, కొత్తబట్టలూ, ఆటవస్తువులూ, దీపావళయితే పెట్టె నిండా టపాకాయలూ ఎన్నో తెచ్చేవారు(ట) అంతేగాక పిల్లలకు కొత్త కొత్త అణాలు, అర్ధణాలు, బేడాలు, చిల్లు కానీలు, పైసలు, పాత పావలా, కొత్త పావలాలు పొట్లాల్లోంచి తీసి పంచిపెట్టేవారు. ఆడపిల్లల కయితే స్కిప్పింగ్ రోప్స్, పూసలు, బొమ్మలూ, చేతి రుమాళ్ళు, మగ పిల్లలకయితే బంతీ బ్యాట్, రబ్బరు బంతులు, పెన్నులు, పెనసళ్ళు, కీ యిస్తే పరిగెత్తే కార్లు, విమానాలు, బైనాక్యులర్స్, రంగుల గోళీ కాయలు, బిస్కట్లు బొమ్మల పుస్తకాలు యిలా ఎన్నెన్నో తెచ్చి పంచిపెట్టేవారు. అంతేగాక మా పిల్లల్నందర్నీ వేసుకు కాఫీ హోటళ్ళకి తీసికెళ్ళి టిఫిన్లు తినిపించే వారు. సాయంత్రాలు దుర్గాకళామందిరానికి లేప్పోతే సరస్వతి టాకీస్‌కి లీలామహల్‌కి సినిమాలకు తీసుకెళ్ళే వాళ్ళు. అంచాత ఆ బెజవాడ పెదనాన్నగారు వస్తే మా పిల్లలకెంతో సరదాగా ఎగిరిగంతేసినంత ఉత్సాహంగా వుండేది. ఆ రోజుల్లో

సత్యనారాయణపురం స్టేషన్ మీంచి చిన్నరైళ్ళు (మీటర్ గేజి బళ్ళు, గూడ్సులు) పోయేవి. రైళ్ళు చూడ్డానికి లెవెల్ క్రాసింగ్ గేటు దగ్గరకు వెళ్ళేవాళ్ళం పిల్లలమంతా. అప్పుడు సత్యనారాయణపురం అంతా మామిడితోటలుండేవి. ఆ తోటల్లో చిన్న చిన్న మామిడి చెట్లెక్కి ఆడుకునేవాళ్ళం. ఆ తోటల్లో చిన్నచిన్న మామిడి చెట్లెక్కి ఆడుకునేవాళ్ళం. మా యింట్లోనే రామలక్ష్మణుల్లా చెరోవైపు చెరో మామిడి చెట్టూ, యింటి ముందో మామిడి చెట్టూ, వెనక వేప చెట్టు, బాదంచెట్టు, నూతి వద్ద జామచెట్టు, పెరట్లో దానిమ్మ, పారిజాతం పూల మొక్క, గుమ్మం ముందు ఎరుపు, తెలుగు వూదా బోగన్‌విల్లాలు, గన్నేరు చెట్టు యింకా కుండీలలో క్రోటన్స్ మొక్కలు ఎన్నో వుండేవి. మా మామయ్యగారు బైస్కిల్ మీద మధ్యాహ్నం పదకొండు దాటాక 'ట్రింగ్! ట్రింగ్' మని బెల్ కొట్టుకుంటూ యింటికి వస్తుండగానే, వీధి కుక్కలన్నీ ఆయనకు స్వాగతం చెప్పడానికి ఎదురెళ్ళేవి. ఆయనకు కుక్కలంటే ప్రీతి. మునిసిపాలిటీ కుక్కల బండి వచ్చినపుడు సగం కుక్కలన్నీ యివి మావేనని విడిపించేసేవారు. ఆ కుక్కలకీ కాస్త కాస్త అన్నం పెట్టించేవారు. అందుకని మా మామయ్యగారు సైకిలెక్కి వీధి మలుపు తిరిగే దాకా సాగనంపి వచ్చేవి. సాధారణంగా మా మావయ్యగారి కూడా ఎవరో ఒకరిద్దరో ముగ్గురో నలుగురో వస్తూ వుండేవారు. ఆ పేటలోని జట్టీలన్నీ, చోరీ కేసులు, అత్తకోడళ్ళ తగూల దాకా యాయనే పరిష్కరించేవారు. ఆయన యింటికి రాగానే పంచె కట్టుకుని మొక్కల దగ్గర బాగు చేస్తూ, గొయ్యి తవ్వుతూ,నూతి నుంచి తవ్విన కాలవలోని నీళ్ళు మొక్కలకు మళ్ళిస్తూ ఓ గంటో గంటన్నరో మొక్కల దగ్గర తోట పని చేసేవారు. అప్పుడు నూతి దగ్గర కూర్చుంటే పిల్లలం ఎవరో ఒకరం తోడి పదిహేను బాల్చీలు నీళ్ళు నెత్తిమీద పోసేవాళ్ళం. అప్పుడాయన గళ్ళ గళ్ళ లుంగీ కట్టుకుని భోంచేసి పందిరి మంచం మీద పడుకుని కాళ్ళు పిసకమనేవారు. ఆడపిల్లలకి అణాయిస్తే మగ పిల్లలకి అర్ధణా. హాఫ్ రేట్ - అలా ఎప్పటికప్పుడు కాళ్ళు పిసికినందుకు డబ్బులు ఠంచన్‌గా యిచ్చేసేవాళ్ళు.

ఆ రోజుల్లో యింటింటికీ ఒక ఫ్యాన్సీ బండివాడు ఫ్యాన్సీ సామాన్లు వేసుకుని వచ్చేవాడు. వాడి దగ్గర ఫిలింబాక్స్, ఫిల్ములూ, భూతద్దం, అద్దాల రంగు గొట్టం, దిక్సూచి పెన్ను, గాజుపాళీలు యిలాటివి కొనుక్కునే వాళ్ళం. కలకత్తా జాంకాయలని పెద్ద పెద్ద జాంకాయలు, పంపర పనసపళ్ళూ, వడ్డపూడి నారింజ, సీతాఫలాలు పుష్కలంగా దొరికేవి. ఎవరేనా తెచ్చేవాళ్ళు లేదా కొనుక్కునేవాళ్ళం.

మా చిన్నపుడు బెజవాడలో వేసంకాలం అస్తమాను కొంపలంటుకు పోయేవి. ఈ యిళ్ళు ఆర్పడానికి మా మామయ్యగారు మరి కొంతమంది ఆయన మిత్రులు నిప్పుల్లోకి దూకి మనుషుల్ని పిల్లల్ని బైటకి లాగి, వస్తువులు కాపాడి, పశువుల్ని విడిపించి, మంటలార్పివస్తుండేవారు. బూట్లతో మంటల్లోకి దూకేసేవారు. రాత్రిళ్ళు సత్యనారాయణపురం కొత్తగా పుట్టింది కావడం వలన దొంగల భయం వుండేది. దొంగల్ని పట్టుకుందుకు టార్చిలైటు, కర్ర, కిల్లీలు దట్టించి ముక్కపొడుం పీలుస్తూ గస్తీలు తిరిగేవాళ్ళు, ఎవళ్ళయినా సరే రవుడీయిజం చూపిస్తే ముందు కొట్టి మాట్లాడేవాళ్ళు.

రవిస్ కాలవ వంతెన దగ్గర యిప్పుడు అలంకార్ టాకీస్ వున్నచోట మునిసిపాలిటీదో ఎవరిదో ఖాళీస్థలం వుండేది. అక్కడ డేరాలు వేసి గుబ్బి వీరన్న కంపెనీ నాటకాలు వేసేవారు. సర్కస్‌లు వచ్చేవి. దుర్యోధనుడు, భీముడు, కృష్ణుడు – వీళ్ళ పెద్ద పెద్ద కటవుట్లు రవీస్ కాలవ వంతెనకి యిటూ అటూ నిలబెట్టేవారు. జట్కా బండిలో బేడ వుంటే కిరాయి ఎద్దు బండికి అణానే. రెండో ప్రపంచ యుద్ధ కాలంలోనో కాస్త ముందుగానో రిక్షాలొచ్చాయ్. 'రిక్షా' ఎక్కి మనిషి చేత లాగించుకోడానికి చాలామంది సిగ్గుపడేవారు. అలా ధైర్యం చేసి ఎక్కినవార్ని 'నరవాహనం' ఎక్కాడని వెక్కిరించేవాళ్ళు. రిక్షాకి కూడా అణన్నర, బేడ, మూణ్ణాలు యిచ్చేవారు.

ఈ రోజుల్లో బ్రామ్మల్లో సబ్ కేస్ట్ ఫీలింగ్స్ ఎక్కువ. బందరులో వైదీకుల కాలేజీ, గుంటూరులో నియోగుల కాలేజీ వాళ్ళు వీళ్ళూ నన్నయ వైదీకనీ, తిక్కన నియోగనీ కొట్టుకు చచ్చేవాళ్ళు. మమ్మల్ని అభం శుభం తెలియని పిల్లల్ని మీరు వైదికులా నియోగులా అని అడిగేవారు. వైదీకులంటే జంధ్యాల దక్షిణా మూర్తి గారి దగ్గరకెళ్ళి వైద్యం చేయించుకునేవారు. నియోగులు టి.వి.యస్. చలపతిరావు గారి దగ్గరకి, కొమ్మూరి సాంబశివరావు గారి దగ్గరికి వెళ్ళేవాళ్ళు. విశ్వనాథ సత్యన్నారాయణ వైదిక కవి అనీ కాటూరి వెంకటేశ్వరరావుగారు, పింగళి లక్ష్మీకాంతంగారు నియోగి కవులనీ, వారి శిష్యులు వీరి శిష్యులూ కుస్తీలు పడుతూ వుండేవారు.

వన్ టవున్లో కాపులు, బ్రాహ్మలు, కోవట్లు ఎక్కువ వుండేవారనుకుంటా. గవర్నర్‌పేటలో బ్రామ్మలు, కోవట్లు – సత్యనారాయణపురం, గాంధీనగరం బ్రామ్మలు, కోవట్లు – ముఖ్యంగా వుండేవారు. అప్పుడే చుట్టుపక్కల గ్రామాల్నుంచి కమ్మవారు, గోదావరి జిల్లాల నుంచి రాజులు, నెల్లూరు వైపు నుంచి రెడ్లు బెజవాడ వచ్చి వ్యాపారాలు మొదలెట్టారు.

అప్పటి బెజవాడ స్టేషను ఓ షెడ్డులో వుండేదట. రైలు దిగి ఏలూరు కాలవ దాటి సత్యనారాయణపురం వెళ్ళాలన్నా, రవీస్ కాలవ వంతెన దాటిగవర్నరుపేట లోకి రావాలన్నా దొంగల భయం, అంతటా నిర్మానుష్యంగా వుండేదిట.

ఆనాటి బెజవాడ గురించి మరోసారి –

# బూచాడమ్మ బూచాడు లేక టెలిఫోన్‌రాక్షసుడు

సాక్షాత్తూ శ్రీకృష్ణుడి స్నేహితుడై యుండి కూడా కుచేలుడు అటుకులు పట్టికెళ్ళి దేముడికిచ్చి అష్టైశ్వర్యాలు పొందాడు గాని అతగాడు కమ్యూనిస్ట్ ఎందుకు కాలేదా అని నాకోడవుటు. కుచేలుడు నక్సలైట్ అయి కృష్ణుడి మీద మధురానగరి మీద తిరగబడాలి. కాని 'హరె రాం హరెకృష్ణ రాధే గోవింద' అని చిరతలట్టుకు డాన్స్ జేసుకుంటూ వీధుల్లో గంతులేస్తే ఆధ్యాత్మిక స్పృహ వస్తుంది కానీ సామాజిక స్పృహ వస్తుందా? శ్రీకృష్ణుడికున్నంత సామాజిక స్పృహ కుచేలుడికి లేదు. మన వాళ్ళంతా చెప్పినట్లు దోపిడీ చేసేవాడికి తెలిసినంత కమ్యూనిజం